

దసరా సంబరం
మహానందిలో దసరా సంబరాలు అంబరాన్నంటాయి. ఉత్సవాల చివరి రోజు శనివారం శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారు నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. 8లో▸



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ
శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి మేళ తాళాల మధ్య ఆలయ ప్రదక్షిణ చేశారు.



గుడేకల్..గుండెజల్లు
గుడేకల్ గ్రామంలో యువకులు ప్రదర్శించిన సాహస విన్యాసాలు అబ్బురపరిచాయి. ప్రతి ఏటా దసరా పండుగ రోజు ప్రదర్శించడం ఈ గ్రామంలో ఆనవాయితీగా వస్తోంది. 8లో▸

న్యూస్‌రీల్

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండండి
- కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): అక్టోబర్ 13 నుంచి 16వ తేదీల మధ్య జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. ఆదివారం ఉదయం ఆయన సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాలు వస్తే సహాయక చర్యలు చేపట్టేందుకు సన్నద్ధం కావాలన్నారు. ప్రజలకు ఇబ్బందిలేకుండా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఏ సమస్య ఉన్నా 08518-277305కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు. అలాగే డివిజన్, మండలస్థాయిల్లోనూ కంట్రోల్ రూమ్‌లను అందుబాటులోకి తేవాలని సూచించారు. భారీ వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాల ప్రజలను శిబిరాలకు తరలించడానికి వీలుగా భవనాలను గుర్తించాలని కలెక్టర్ సూచించారు.

ముగిసిన దసరా సెలవులు
కర్నూలు సిటీ: జిల్లాలోని విద్యా సంస్థలకు ఈ నెల 3వ తేదీ నుంచి ఇచ్చిన దసరా సెలవులు ముగియడంతో సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. పది రోజుల పాటు స్కూళ్లకు సెలవులు ఇవ్వడంతో పాటు, ఇటీవల కురిసిన వర్షాల వలన స్కూళ్లు, కాలేజీల పరిసరాల ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉంటాయని తప్పనిసరిగా శుభ్రం చేయించాలని విద్యాశాఖ అధికారులు పాఠశాల హెచ్‌ఎంలను ఆదేశించారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత డీఎస్సీ శిక్షణ
కర్నూలు(అర్బన్): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఔత్సాహికులకు ఉచిత డీఎస్సీ (రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ ప్రాతిపదికన) శిక్షణను అందించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మీదేవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత శిక్షణపై ఆసక్తి ఉన్న అభ్యర్థులు తప్పనిసరిగా టెట్ పాస్ అయి ఉండాలని, ప్రభుత్వం అందించే పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ పథకానికి ఉన్న అర్హతలు కలిగి ఉండాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 21వ తేదీలోగా జ్ఞానభూమి వెబ్ పోర్టల్‌లో jnanabhumi.ap.gov.inలో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 27వ తేదీన ఎస్‌జీటీ సిలబస్ ఆధారంగా ఆన్‌లైన్ స్క్రీన్ టెస్ట్ నిర్వహించబడునన్నారు. పరీక్ష పూర్తయిన వెంటనే వారికి ఇచ్చిన మార్కులను తెలుసుకునే అవకాశం ఉందన్నారు. శిక్షణకు ఎంపిక చేసేందుకు స్క్రీనింగ్ టెస్ట్‌లో పొందిన 85 శాతం మార్కులు, టెట్‌లో పొందిన మార్కులలో 15 శాతం వెయిటేజీ తీసుకొనబడుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు స్థానిక సచివాలయం స్థాయిలో సిక్స్ స్టెప్ వెరిఫికేషన్ నిర్వహించబడుతుందన్నారు.

16 నుంచి మణుగూరు ఎక్స్‌ప్రెస్ పునఃప్రారంభం
ఆదోని సెంట్రల్: మణుగూరు నుంచి ఆదోని మీదుగా బెళగావికి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 16వ తేదీ నుంచి పునఃప్రారంభం కానుంది. కరోనా సమయంలో రద్దయిన ఈ రైలు పునఃప్రారంభించడం పట్ల ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ రైలు సోమ, గురు, ఆది, బుధవారాల్లో అందుబాటులో ఉంటుందని ఆదోని స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మణుగూరు నుంచి బయలుదేరి హైదరాబాద్, రాయచూర్ మీదుగా ఆదోనికి ఉదయం 5.30 గంటలకు చేరుకుంటుందని, తిరిగి బెళగావి నుంచి మణుగూరుకు వేళ్లే సమయంలో ఆదోనికి రాత్రి 10.30 గంటలకు చేరుకుంటుందని వివరించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

22న వ్యవసాయ శాఖ ప్రాంతీయ సదస్సు
కర్నూలు(అగ్రికల్చర్): నూతన కౌలుదారు చట్టాన్ని రూపొందించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా కర్నూలులో ఈ నెల 22న ఉమ్మడి కర్నూలు జిల్లా, ఉమ్మడి అనంతపురం జిల్లాలకు సంబంధించి కర్నూలులో ప్రాంతీయ సదస్సు నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇటు భూ యజమానులు, అటు కౌలుదారులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా 2019లో ప్రత్యేక కౌలుదారు చట్టాన్ని రూపొందించింది. ఈ చట్టం కింద సీసీఆర్‌సీ కార్డులు పొందిన వారందరికీ అన్ని రకాల ప్రభుత్వ ప్రయోజనాలు అందాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూపొందించిన చట్టాన్ని రద్దు చేసింది. కొత్తగా కౌలుదారుచట్టాన్ని తెస్తోంది. ఇందులో భాగంగా వివిధ వర్గాల నుంచి సలహాలు, సూచనలు, అభిప్రాయాలు తీసుకునేందుకు ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తోంది. కర్నూలులోని ఉద్యాన భవన్‌లో జరిగే ఈ సదస్సుకు వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు కూడా పాల్గొనే అవకాశం ఉంది.



బన్ని ఉత్సవానికి కర్రలతో వస్తున్న మహిళా భక్తులు



దేవరగట్టులో కొనసాగుతున్న కర్రల సమరాన్ని తిలకిస్తున్న భక్తజనం



స్వామి విగ్రహాలకు రక్షణగా నిలిచిన భక్తులు

భక్తి ఉప్పొంగి.. నెత్తురు చిందింది!

- దేవరగట్టులో కాళరాత్రి వేళ రక్త తర్పణం
- కర్రల సమరంలో 95 మంది భక్తులకు గాయాలు
- 20 మంది పరిస్థితి విషమం
- కనుల పండువగా మాళ మల్లేశ్వరుడి కల్యాణం
- లక్షకు పైగా తరలి వచ్చిన భక్తజనం
- జైత్రయాత్రలో పట్టు తప్పిన పల్లకీ మోసే భక్తులు



సింహాసన కట్టపై కొలువైన మాళ మల్లేశ్వర స్వామి విగ్రహాలు





అర్ధరాత్రి వేళ చుట్టూ చిమ్మచీకటి.. అక్కడక్కడా భగభగ మండే దివిటీలు.. ఓ వైపు డిర్ర్..ర్ర్...గోపరక్...బహుపరాక్.. అంటూ భక్తుల నినాదాలు.. మరో వైపు కర్రలు చేత పట్టి ఆనంద తాండవం.. అప్పుడు మొదలైంది.. పసుపు వర్ణంలోని బండారాన్ని చల్లుతుండగా.. కర్రలు కరాళ నృత్యం చేశాయి. భక్తుల తలలు పగిలాయి. ఆచారం మాటున సంప్రదాయ సమరం కొనసాగింది. దేవరగట్టు రక్తమోడుతున్నా.. మాళమల్లేశ్వరుడి జైత్రయాత్రను భక్తులు విజయవంతం చేశారు.



ఉత్సవంలో గొరవయ్యల నృత్యం



శిబిరంలో క్షతగాత్రులకు వైద్యం అందిస్తున్న దృశ్యం

హొళగుంద: దేవరగట్టులో ఈ సారి కూడా సంప్రదాయానిదే పైచేయి అయ్యింది. విజయ దశమిని పురస్కరించుకుని హొళగుంద మండలం దేవరగట్టులో శనివారం రాత్రి ప్రారంభమైన బన్ని ఉత్సవం ఆదివారం ఉదయం వరకు ఉద్వేగంగా, ఉత్కంఠ భరితంగా సాగింది. జైత్రయాత్రలో గట్టుపై రక్తం చిందింది. ఉత్సవాన్ని తిలకించేందుకు కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ నుంచి లక్షన్నరకు పైగా భక్తులు తరలివచ్చారు. ఉత్సవాలు నిర్వహించే నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులతో పాటు దేవరగట్టు చుట్టు పక్కల గ్రామాలైన నిట్రవట్టి, బిలేహాల్, విరుపాపురం, ఎల్లార్తి, సుళువాయి, అరికెర, అరికెర తండా, కురుకుంద, సమ్మతగేరి, లింగంపల్లితో పాటు దాదాపు 15 గ్రామాలకు చెందిన భక్తులు ఉత్సవంలో పాల్గొని మొగలాయి ఆడారు. ఉత్సవంలో దాదాపు 95 మందికి గాయాలు కాగా అందులో 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మాళమల్లేశ్వర స్వామి ఊరేగింపునకు ముందు మాళమ్మ, మల్లేశ్వరుని కల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు శనివారం రాత్రి 11.30 గంటలకు డొళ్లిన బండ వద్దకు చేరుకుని పాలబాస తీసుకున్నారు. అనంతరం ఎస్పీ బిందుమాధవ్, సబ్ కలెక్టర్ కలెక్టర్ మౌర్య భరద్వాజ తదితరులకు బండారం (పసుపు) ఇచ్చి వారి అనుమతితో కొండపైకి బయలుదేరారు. మార్గమధ్యలో ఆస్పరి మఠం పక్కనే కొంత మంది భక్తుల మధ్య ఘర్షణ జరిగింది. కర్రలతో పరస్పరం దాడి చేసుకోవడంతో కొందరికి గాయాలయ్యాయి. బన్ని ఉత్సవంలో కీలకమైన మాళ మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆ తర్వాత మొదలైన జైత్రయాత్ర.. ఉత్సవాన్ని చూస్తున్న భక్తుల ఒళ్లు జలదరించేలా ముందుకు సాగింది. జైత్రయాత్ర పదాల గట్టు వైపు వెళ్తుండగా బసవన్న గుడి సమీపంలోని నీటి ట్యాంకు వద్ద అరికెర, ఇతర గ్రామాలకు చెందిన వారు పల్లకీ మోస్తున్న వారితో పాటు చుట్టూ ఉన్న భక్తులపై రింగు కర్రలు, దివిటీలతో దాడి చేయడంతో పల్లకీ కింద పడిపోయినట్లు తెలుస్తోంది.

తగ్గిన భక్తుల తాకిడి
ఈ కర్రల సమరానికి ఈ ఏడాది భక్తుల సంఖ్య కొద్దిగా తగ్గినట్లుగా తెలుస్తోంది. మొగలాయి ఆడే వారి సంఖ్య కూడా తగ్గింది. పత్తి తీత పనులు ఊపందుకోవడంతో కొంత మంది కూలీలు, రైతులు ఉత్సవానికి రాలేకపోయారు. ఈ ఏడాది ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా గాయాలతో బన్ని ఉత్సవం ముగియడంతో పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ పర్యవేక్షణలో ఆదోని, నంద్యాల, కర్నూలు, డోన్, తదితర ప్రాంతాలకు చెందిన డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లతో ప్రత్యేక బలగాలు, మహిళా పోలీసులు, స్పెషల్ పార్టీలతో కలిసి మొత్తం కలిసి 800 మంది బందోబస్తు నిర్వహించారు. అల్లర్లకు పాల్పడే వారిని గుర్తించడానికి 82 సీసీ కెమెరాలు, 3 డ్రోన్ కెమెరాలు, 700 భారీ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి పోలీస్ కంట్రోల్ రూం ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు.



బందోబస్తుకు తరలివచ్చిన పోలీసులు

మూన్నెళ్ల తర్వాత..



మాళ మల్లేశ్వరస్వామి జైత్రయాత్రలో భాగంగా ఆదివారం తెల్లవారుజామున ఆలయ పూజారి గిరిస్వామి కార్ణీకం వినిపించారు. బసవన్నగుడి 'పైకెక్కి డిర్ర్..ర్ర్ గోపరక్' అంటూ భవిష్యవాణి కన్నడలో వివరించారు. ఈ ఏడాది పత్తి ధర ఆశాజనకంగా ఉంటుందని, యుద్ధాలు కోరుకోకుండా శాంతిని కోరుకోవాలని, వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని చెప్పారు. దసరా నుంచి 3 నెలల తర్వాత ఆరు నెలల పాటు వివిధ పంటలకు గిట్టుబాటు ధర ఉంటుందన్నారు.

మరింత చైతన్యం రావాలి



బన్ని ఉత్సవంలో గతేడాదితో పోలిస్తే కర్రలు తగ్గాయి. క్షతగాత్రుల సంఖ్య తగ్గింది. పోలీసు యంత్రాంగం, ఇతర శాఖాధికారులు భక్తుల్లో అవగాహన కల్పించడం, నాటుసారాను అరికట్టడం, బైండోవర్ కేసులు నమోదు తదితర చర్యలు ఫలించి క్షగాత్రుల సంఖ్య తగ్గింది. ప్రధానంగా యువతలో చైతన్యం రావాలి. చిన్నచిన్న గాయాలతో ప్రశాంత వాతావరణంలో ఈ బన్ని ఉత్సవం కొనసాగింది.

– జిల్లా ఎస్పీ బిందుమాధవ్

మార్పు మొదలైంది



ఉత్సవంలో మద్యం తాగి, కర్రలు పట్టుకుంటే జరిగే నష్టం గురించి తెలుసుకున్న భక్తుల్లో మార్పు వస్తోంది. ఈ ఏడాది రింగు కర్రలు తగ్గాయి. సంప్రదాయ వేడుక వైపు అడుగులు వేస్తున్నారు. గడిచిన ఉత్సవాల్లో కన్నా ఈ సారి ప్రశాంతంగా బన్ని ఉత్సవం జరగడం ఆనందంగా ఉంది. భక్తులు, పోలీసు, జిల్లా యంత్రాంగంతో పాటు దేవరగట్టు పరిసర గ్రామాల ప్రజల కృషివల్లే ఇది సాధ్యమైంది.

– మౌర్య భరద్వాజ్, ఆదోని సబ్ కలెక్టర్

నేడు రథోత్సవం
దేవరగట్టులో సోమవారం సాయంత్రం మాళ మల్లేశ్వరస్వామి రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. రథాన్ని ఇప్పటికే ప్రత్యేకంగా అలంకరించి సిద్ధం చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15న గొరవయ్యల ఆటలు, గొలుసు తెంపుట, దేవదాసీల క్రీడోత్సవం, వసంతోత్సవం, కంకణ విసర్జన, 16న మాళమల్లేశ్వర స్వామి విగ్రహాలు నెరణికి గ్రామానికి చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

కర్రల సమరం సాగిందిలా..
- ➤ శనివారం సాయంత్రం 3 గంటల నుంచి దేవరగట్టు వైపు భక్తుల రాక మొదలైంది.
- ➤ 4.30..ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ గట్టుకు చేరుకున్నారు.
- ➤ 6.20 భక్తులు పెద్ద ఎత్తున చేరుకుంటుండగా పోలీసు అధికారులు అలర్ట్ అయ్యారు.
- ➤ 10:30.. గట్టు పరిసర గ్రామాల భక్తులు కర్రలు, దివిటీలతో రోడ్డుకిరువైపులా మోహరించారు.
- ➤ 11.00.. నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు డొళ్లిన బండ వద్దకు చేరుకుని పాలబాస తీసుకున్నారు.
- ➤ 11:30.. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ గట్టుకు చేరుకున్నారు.
- ➤ ఆదివారం 12.25 నుంచి 1 గంట సమయంలో మాళ మల్లేశ్వరుని కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.
- ➤ 1.10.. స్వామివారి పల్లకీ, విగ్రహాలతో గట్టుకు కిందకు బయలుదేరారు.
- ➤ 1.20.. విగ్రహాలు సింహాసన కట్టకు చేరుకుంటుండగా కర్రలు, అగ్గి కాగడాలు ఒక్కసారిగా గాలిలో లేచాయి.
- ➤ 2.20.. జైత్రయాత్ర ముళ్లబండకు చేరుకోవడంతో విగ్రహాలకు పూజలు చేశారు.
- ➤ 4.00.. రక్షపడి వద్ద కంచాబీర వంశానికి చెందిన గొరువయ్య బసవరాజు కాలి పిక్కలకు దబ్బణంతో గుచ్చుకోగా వచ్చిన రక్తాన్ని అక్కడ మణి, మల్లాసుర అనే రాక్షస గుండులకు రక్తతర్పణం చేశాడు.
- ➤ 4.30.. శమీవృక్షం వద్ద పూజలు చేశారు.
- ➤ 6.40.. విగ్రహాలు సింహాసన కట్టకు చేరుకోగానే భక్తులు జేజేలు పలికి, చప్పట్లు కొట్టి స్వామిని దర్శించుకుని ఇంటిదారి పట్టారు.

ఉత్కంఠకు నేడు తెర

- నేడు ఎక్సైజ్ టెండర్ల లక్కీ డిప్
- జిల్లాలో 99 మద్యం దుకాణాలు
- మండలం యూనిట్‌గా అనుమతులు
- 16 నుంచి కూటమి కిక్కు



జెడ్పీలో లక్కీడిప్‌కు ఏర్పాట్లు చేస్తున్న పోలీసు అధికారులు

కర్నూలు: లక్కు కిక్కు ఎవరికి దక్కనుందో మరి కొద్ది గంటల్లో తేలనుంది. ప్రైవేటు మద్యం దుకాణాలు ఎవరిని వరిస్తాయో, ఎవరికి అవకాశం దక్కుతుందో అనే ఉత్కంఠ ఆశావహుల్లో నెలకొంది. సోమవారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో కలెక్టర్ సమక్షంలో దరఖాస్తులను లాటరీ తీసి ఖరారు చేస్తారు. అంతవరకు దరఖాస్తుదారులందరూ టెన్షన్ టెన్షన్‌గా ఉండాల్సిందే. జిల్లాలో 99 దుకాణాలకు నోటిఫికేషన్ జారీ కాగా, 3,046 మంది దరఖాస్తు చేసి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు లక్కీ డిప్ కోసం ఎదురు చూస్తున్నారు. సోమవారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో లాటరీ తీసి దుకాణాలు కేటాయించనున్నారు. దరఖాస్తుదారులంతా ఉదయం 7 గంటలకు అక్కడికి చేరుకోవాలి. దరఖాస్తుదారుడు తప్పనిసరిగా ఆర్1 రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఏ3 (బీ) అప్లికేషన్ ఫారం, ఈ1 ఎంట్రీ పాస్, గుర్తింపు కార్డును తమ వెంట తెచ్చుకోవాల్సి ఉంది. అలాంటి వారిని మాత్రమే లోపలకు అనుమతిస్తారు. దరఖాస్తుదారుడు రాని పక్షంలో ప్రతిపాదకున్ని అనుమతిస్తారు. లాటరీ గెజిట్ నోటిఫికేషన్ సీరియల్ ప్రకారం జరుగుతుంది. కర్నూలు జిల్లాకు సంబంధించి మొదటి కర్నూలు కార్పొరేషన్ నుంచి లక్కీ డిప్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి పర్యవేక్షణలో లక్కీ డిప్ ఏర్పాట్లు పూర్తయ్యాయి. మద్యం దుకాణాల దరఖాస్తులు ఎక్సైజ్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన సీల్డ్ టెండర్ల బాక్సుల్లో ఉన్నాయి. వాటన్నింటిని ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ భవనానికి తరలించారు. ఈ నెల 15వ తేదీ వరకు ప్రభుత్వ దుకాణాల్లోనే వ్యాపార లావాదేవీలు కొనసాగుతాయి. 16వ తేదీ నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి.

భారీ బందోబస్తు ...
ఎక్సైజ్ టెండర్లకు లక్కీ డిప్ నిర్వహణ నేపథ్యంలో స్థానిక జిల్లా పరిషత్ వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై ఆ శాఖ ఉన్నతాధికారులు జిల్లా అధికారులతో వీసీ ద్వారా సమీక్షించారు. ఎక్కడ ఏ చిన్న పొరపాటు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపిక ప్రక్రియ మొత్తం కలెక్టర్ వెబ్‌సైట్ ద్వారా ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ డాష్ బోర్డుకు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేయాల్సి ఉంటుంది. లాటరీ తగిలిన వెంటనే అక్కడికక్కడే ప్రొవిజినల్ లైసెన్స్ జారీ చేస్తారు. లాటరీ నిర్వహించే ప్రదేశం, సమయం తదితర వివరాలతో దరఖాస్తుదారులకు జిల్లా ఎక్సైజ్ అధికారులు ఇప్పటికే సమాచారం పంపారు.

టీబీ డ్యాంకు పెరిగిన ఇన్ ఫ్లో

- జలాశయం ఎగువన భారీ వర్షాలు
- 16 క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

హొళగుంద/కర్నూలు సిటీ: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్‌లోని తుంగభద్ర జలాశయానికి ఆదివారం మళ్లీ వరదనీరు పోటెత్తింది. కొద్ది రోజుల క్రితం జలాశయానికి వరద తగ్గడంతో డ్యాం గేట్లన్నీ మూసేసిన అధికారులు గడిచిన రెండు రోజులుగా ఇన్‌ఫ్లో పెరుగుతుండటంతో గేట్లు ఎత్తారు. ఆదివారం జలాశయానికి 84,504 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 82,968 క్యూసెక్కులు నదికి, కాలువలకు వదులుతున్నారు. శివమొగ్గ, వరనాడు, శృంగేరి, తీర్థహళ్లి తదితర ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో డ్యాంలోకి వరదనీటి ప్రవాహం కొనసాగుతోంది. జిల్లాకు సంబంధించి ఎల్లెల్సీలో ఆంధ్రా సరిహద్దు 250 కి.మీ వద్ద 691 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. టీబీ డ్యాం నుంచి వదిలిన నీటితో పాటు కర్ణాటక, ఏపీ సరిహద్దుల మధ్యన ఉన్న వేదావతి నదిలోని వరద నీరు సైతం సుంకేసుల బ్యారేజీకి చేరుకుంటోంది. దీంతో బ్యారేజీలో ఇన్‌ఫ్లో పెరుగుతుండడంతో గేట్లు పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 69,850 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, ఇందులో కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు, బ్యారేజీ నుంచి 16 గేట్లు పైకెత్తి దిగువకు 67,312 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

నంది వాహనంపై ఆది దంపతుల విహారం

- శ్రీశైలంలో వైభవంగా దసరా మహోత్సవాలు
- చివరి రోజు నిజాలంకరణలో కటాక్షించిన భ్రమరాంబాదేవి



నంది వాహన సేవలో పాల్గొన్న భక్తజనం



శమీ వృక్ష పూజలు నిర్వహిస్తున్న పండితులు

శ్రీశైలంటెంపుల్: ఇలకైలాసమైన శ్రీశైలంలో దసరా మహోత్సవాలు అంగరంగా వైభవంగా జరిగాయి. ఉత్సవాల చివరిరోజైన శనివారం భ్రమరాంబాదేవి నిజరూప అలంకారంలో దర్శనమివ్వగా..ఆదిదంపతులు నందివాహనంపై విహరించారు. శ్రీశైల మహాక్షేత్రంలో 10 రోజుల పాటు సాగిన దసరా మహోత్సవాలు పూర్ణాహుతితో ముగిశాయి. దసరా మహోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని భ్రమరాంబాదేవి స్వరూపంలో (నిజాలంకరణ) అలంకరింపజేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. విజయదశమి రోజున సాయంత్రం నంది వాహన సేవ నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను నందివాహనంపై ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజాదికాలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని శమీ వృక్షానికి శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించారు. అనంతరం నందివాహనాధీశులైన స్వామి అమ్మవార్లను శమీ వృక్షం చుట్టు ప్రదక్షిణ చేయించారు. శనివారం సాయంత్రం స్వామి అమ్మవార్లకు ఆలయ పుష్కరిణి వద్ద నేత్రానందభరితంగా తెప్పోత్సవం నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రాంగణంలోని స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు షోడశోపచార పూజలు చేశారు. ఆలయ రాజగోపురం నుంచి ఊరేగింపుగా తోడ్కొని వచ్చి పుష్కరిణిలో ఏర్పాటు చేసిన తెప్పపై ఆశీనులు చేయించి విశేష పూజాదికాలు నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ వేదమంత్రాలతో తెప్పోత్సవం నిర్వహించారు.

క్లుప్తంగా

25 నుంచి మహిళల రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, రగ్బీ ఇండియా, ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలోని ఆర్.జి.ఎం. ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు ఖేలో ఇండియా మహిళల రగ్బీ పోటీలు నిర్వహించనున్నట్లు రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న అండర్–15 విభాగంలో అంతర్ పాఠశాలల బాలికల పోటీలు, 26న అండర్–18 విభాగంలో అంతర్ కళాశాలల పోటీలు, 27న 18 సంవత్సరాలు పైబడిన మహిళలకు పోటీలు ఉంటాయని వివరించారు. ప్రతి కేటగిరీలో రూ.లక్ష నగదు బహుమతి ఉంటుందని, అలాగే విజేతలకు మెడల్స్, ట్రోఫీ, క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9393827585 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు దుర్మరణం

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. వృద్ధురాలు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లినట్లు భావిస్తున్నారు. మృతురాలి వయస్సు 60 సంవత్సరాలు ఉంటుందని, ఎరుపు రంగు జాకెట్, లేత పసుపు, ఆకుపచ్చ డిజైన్ చీర ధరించి ఉన్నట్లు చెప్పారు. మృతురాలి పేరు, ఇతర వివరాలు తెలియరాలేదన్నారు. బలపనూరు వీఆర్‌ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు 91211 01096 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

లారీ- ఆటో ఢీ
ఏడుగురికి గాయాలు

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని మాధవరం రోడ్డులోని రాయనగర్ వద్ద ఆటో–లారీ ఢీకొన్నాయి. ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనలో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఆదోని నుంచి పెద్దతుంబళం గ్రామానికి ప్రయాణికులతో ఆటో వెళ్తుండగా ఆదోని వైపునకు వస్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో కూర్చొన్న మాబున్నీ, అన్వర్‌బాషా, రేష్మ, రహన్‌దేశాయి, తాహెర్‌బాషా, సాహెల్‌తో పాటు మరొకరికి గాయాలయ్యాయి. ఈమేరకు క్షతగాత్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా గాయపడిన ఏడుగురు వివిధ పనుల మీద ఆదోనికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

శింగనపల్లెలో కొండచిలువ కలకలం



మద్యం మత్తులో కొండచిలువను పట్టుకున్న వ్యక్తి

అవుకు: మండల పరిధిలోని శింగనపల్లె గ్రామంలో కొండ చిలువ కలకలం రేపింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక బీసీ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో కాలువ ఉంది. శనివారం రాత్రి అందులో నుంచి కాలనీలోకి కొండ చిలువ వచ్చింది. దీనిని గమనించని ఓ వ్యక్తి మద్యం మత్తులో పట్టుకొని అరుగుపై కూర్చున్నాడు. అటుగా వెళ్తున్న గ్రామస్తులు పసిగట్టి వెంటనే సదరు వ్యక్తిని అప్రమత్తం చేసి కొండచిలువను కర్రలతో కొట్టి చంపేశారు.

దసరా సంబరం



మహాపూర్ణాహుతి పూజలు చేస్తున్న దృశ్యం



మహానందిలో ఆకట్టుకున్న దసరా వేషాలు



అలరించిన గిరిజనుల నృత్య ప్రదర్శన

- మహానందిలో మహా పూర్ణాహుతితో ముగిసిన ఉత్సవాలు
- ఆకట్టుకున్న దసరా వేషాలు, గిరిజనుల నృత్యాలు



శమీ వృక్షం వద్ద పూజలు చేస్తున్న పండితులు

మహానంది: మహానందిలో దసరా నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా జరిగాయి. తొమ్మిదిరోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాలు శనివారం మహాపూర్ణాహుతితో ముగిశాయి. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, రుత్వికులు ఉదయం నుంచి సాయంత్రం వరకు మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన పూజలు నిర్వహించారు. విజయదశమి పర్వదినం పురస్కరించుకుని శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారు నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం రాత్రి మహానందిలోని ఈశ్వర్‌నగర్ కాలనీలో ఉన్న పురాతన శమీ వృక్షం వద్ద శమీ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారికి మహానందిలో గ్రామోత్సవం నిర్వహించగా ప్రజలు దర్శించుకున్నారు. నవదుర్గ కలశ ఉద్వాసన, ప్రదక్షిణ అనంతరం యాగఫలాన్ని కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లకు సమర్పించారు. మహానందిలో నిర్వహించిన దసరా వేషాలు, గిరిజన యువతుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పూజా కార్యక్రమాల్లో ఆలయ ఏఈఓ ఎరమల మధు, ఆలయ పర్యవేక్షకుడు అంబటి శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు. నంద్యాల పట్టణంలోని బ్రహ్మనందీశ్వరస్వామి దేవాలయానికి వెళ్లిన మహానందీశ్వరస్వామి దంపతులు ఆదివారం మహానందికి చేరుకున్నారు.

వేమనగరి కుటుంబానిదే విజయం

- అశేష జనవాహిని మధ్య పారువేట ఉత్సవం



విజేత వేమనగరి కుటుంబీకుడి ఊరేగింపు

మద్దికెర: విజయదశమి పండుగ పురస్కరించుకొని శనివారం నిర్వహించిన గుర్రాల పారువేట కార్యక్రమం అశేష జనవాహిని మధ్య ఉత్సాహంగా జరిగింది. పారువేట ఉత్సవంలో వేమనగరి యాదవరాజు జగదీల్‌రాయుడు విజయం సాధించారు. ముందుగా గ్రామానికి చెందిన పెద్దనగరి, చిన్ననగరి, వేమనగరి కుటుంబాలకు చెందిన యాదవ వంశీకులు రాజదుస్తుల్లో ఠీవీగా గుర్రాలపై కూర్చొని బయలుదేరగా ఆయుధాలు ధరించిన సైనికులు ఊరేగింపుగా గ్రామ సరిహద్దులోని రాగి మాను కట్ట వద్దకు వచ్చారు. అనంతరం గ్రామానికి 3 కి.మీ దూరంలో బొజ్జనాయునిపేట గ్రామంలోని భోగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ప్రారంభించిన గుర్రాల పారువేటలో యామనగరి కుటుంబానికి చెందిన వారు ముందుగా మద్దికెరకు చేరుకోవడంతో విజయం సొంతమైంది. అనంతరం గ్రామంలోని ప్రధాన రహదారిలో అశేష జనవాహిని మధ్య విజయం సాధించిన అశ్వాన్ని ప్రత్యేకంగా ఊరేగించారు. ఉత్సవాన్ని తిలకించడానికి గ్రామప్రజలే గాకుండా చుట్టుపక్కల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ విజయ్‌శంకర్‌నాయక్ బందోబస్తు నిర్వహించారు.

గొర్రెల పెంపకంపై నేటి నుంచి శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు, నంద్యాల జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువకులకు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ శాస్త్రీయ పద్ధతుల్లో గొర్రెల పెంపకంపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కే.పుష్పక్ తెలిపారు. సోమవారం నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, ఆసక్తి కలిగిన యువకులు దరఖాస్తు సమర్పించి హాజరుకావొచ్చన్నారు. 10 రోజుల పాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమంలో.. లాభసాటి గొర్రెల పెంపకం, దాణా తయారీ, వ్యాధులు – నివారణ పద్ధతులు, టీకాలు వేయించాల్సిన అవసరం, షెడ్ల నిర్మాణం తదితర వాటిపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. 18 – 45 ఏళ్ల వయసున్న వారు అర్హులని, శిక్షణా కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన యువకులు ఆరు ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతా, విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్సులతో సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు కల్లూరు తహసీల్దారు కార్యాలయం పక్కన కెనరా బ్యాంకు హౌసింగ్ బోర్డు బ్రాంచీ పైన (మూడవ అంతస్తు) సంప్రదించవచ్చని, లేదా 90007 10508 నంబరుకు ఫోన్ చేయవచ్చని వెల్లడించారు.

కనులపండువగా రావణ దహనం



ఆదోనిలో రావణ, కుభకర్ణ ప్రతిమల దహనం చేస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: విజయదశమి సంబరాలు ఆదోనిలో అత్యంత వైభవంగా జరిగాయి. పట్టణంలోని మున్సిపల్ మైదానం, ఫారెస్ట్‌లైన్ అంబాభవానీ ఆలయ ఆవరణలో రావణ, కుంభకర్ణ ప్రతిమల దహన కార్యక్రమాలు అట్టహాసంగా జరిగాయి. మున్సిపల్ క్రీడా మైదానంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత రామబాణాన్ని వెలిగించి రావణ, కుంభకర్ణ ప్రతిమల దహనం గావించారు. పెద్దఎత్తున మంటలు ఎగసిపడుతుండగా ప్రజలు ఉత్సాహంగా సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు.

అనుమానాస్పద వ్యక్తులు పోలీసులకు అప్పగింత

మిడుతూరు: శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్ (ఎస్సార్బీసీ) వెంట అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను తలముడిపి గ్రామ రైతులు పట్టుకున్నారు. వెలుగోడు మండలం రేగడగూడూరు గ్రామానికి చెందిన ఈ వ్యక్తులు సంబంధం లేని సమాధానాలు చెప్పడంతో పాటు ఆటోలో వ్యవసాయ మోటార్లకు సంబంధించిన విద్యుత వైర్లు పెట్టుకున్నారు. చోరీలకు పాల్పడుతున్నారనే అనుమానంతో వారిని మిడుతూరు పోలీసులకు అప్పగించారు. దీనిపై ఎస్ఐ ఓబులేసు వివరణ కోరగా రైతులు ముగ్గురు వ్యక్తులను అప్పగించిన మాట వాస్తవమేనని, వారిని తాము విచారిస్తున్నట్లు తెలిపారు.

మద్దమాంబ ఆలయానికి రూ.2 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

మద్దికెర: స్థానిక మద్దమాంబ దేవాలయానికి గ్రామానికి చెందిన గోనాల కుమార్, శారద కుమారులు వీరేంద్రకుమార్, నిత్య, రాజశేఖర్ స్వాతి, విజయ్ కుమార్, కీర్తన రూ.2 లక్షలు ఆలయ నిర్వాహకులు మాజీ ఎంపీపీ నీలకంఠరాయుడుకు ఆదివారం అందజేశారు. వారు మాట్లాడుతూ దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఈ మొత్తాన్ని వినియోగించాలని కోరారు. పెండేకల్లు మాజీ సర్పంచ్ వీరభద్రి, జ్యోతి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ శివారులో శనివారం పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు. గ్రామానికి చెందిన ఉస్సేన్ బాషా, పెనుగొండ, శ్రీనాథ్, మధుసుదన్ పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీస్ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నామని చెప్పారు. నిందితుల వద్ద నుంచి రూ.3450 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నలుగురినిపై కేసు నమోదు చేశారు.

బాల్య వివాహం నేరం

చాగలమర్రి: బాల్య వివాహం చట్టరీత్యానేరమని ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరి అన్నారు. ఆదివారం చాగలమర్రి మండలంలోని కదిరిపురం తండాలో ఓ మైనర్ బాలికకు కొండమనాయునిపల్లె గ్రామానికి చెందిన యువకుడితో వివాహం జరిగింది. దీనిపై అందిన సమాచారంతో స్థానిక ఆర్ఐ అబ్దుల్ సత్తార్, వీఆర్‌ఓ వెంకట్రామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఆదినారాయణ, వెంకటేశ్వర్లుతో కలిసి సీడీపీఓ తండాకు చేరుకునివిచారణ చేపట్టారు.అమ్మాయి వయస్సు తక్కువగా ఉండటంతో అదుపులోకి తీసుకున్నారు. కాగా తమ కుమార్తెకు వివాహ వయస్సు ఉందని, ఆధార్ కార్డులో తక్కువగా నమోదైందని తల్లిదండ్రులు చెబుతున్నారు.

మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని దారుణం

- భార్యను కొట్టి చంపిన భర్త



కురువ కృష్ణవేణి (ఫైల్)

గోనెగండ్ల: దసరా కరి పండుగ రోజు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని భార్యతో గొడవపడి రాయితో కొట్టి చంపిన సంఘటన మండలంలోని కులుమాల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. కోడుమూరు మండలం, అనుగొండ గ్రామానికి చెందిన కృష్ణవేణి (27)ను కులుమాల గ్రామానికి చెందిన కురువ పక్కీరప్పకు ఇచ్చి ఏడేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు నితిన్‌కుమార్, కూతురు శిరీష ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. గత కొంతకాలంగా పక్కీరప్ప మద్యానికి బానిసై పని మానేసి జులాయిగా తిరిగేవాడు. ఈ క్రమంలో ఆదివారం దంపతులు పొలం పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చాక దసరా కరి పండగ కావడంతో మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని భార్య కృష్ణవేణితో పక్కీరప్ప గొడవపడ్డాడు. తన దగ్గర డబ్బులు లేవని భార్య ఎంత చెప్పినా వినిపించుకోలేదు. దీంతో గొడవ పెరిగింది. పక్కీరప్ప ఆగ్రహంతో పక్కనే ఉన్న రాయితో కృష్ణవేణి తలపై కొట్టి కిందకు తోసేశాడు. ఆమె స్పృహ కోల్పోయి అపస్మరక స్థితికి చేరుకుంది. కాలనీ వాసులు 108కు ఫోన్ చేసి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలోనే కృష్ణవేణి మృతిచెందింది. ఘటనపై మృతిరాలి తండ్రి భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

ఎస్సార్బీసీలో యువతి గల్లంతు



గల్లంతయ్యే ముందు ఎస్సార్బీసీలో చెల్లెలు గంగోత్రితో కలిసి స్నానం చేస్తున్న వెన్నెల

పాణ్యం: ఎస్సార్బీసీ ప్రధాన కాల్వలో స్నానానికి వెళ్లి ఓ యువతి గల్లంతైంది. ఆదివారం పాణ్యం సమీపంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గుడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన మాదిగ జార్జికి పద్మ, వెన్నెల (18), గంగోత్రి అనే ముగ్గురు భార్యలు. ఈ ముగ్గురు సొంత అక్కచెల్లెల్లు. తాపీ పని చేసుకొని జీవించే వీరు మూడు నెలల క్రితం బతుకుదెరువులో భాగంగా రేణిగుంటకు వెళ్లారు. అక్కడ పనులు పూర్తి కావడంతో శనివారం తిరిగి స్వగ్రామానికి ఆటోలో బయలుదేరారు. రాత్రి ఒంటిమిట్ట దేవస్థానం వద్ద నిద్ర చేసి ఆదివారం ఉదయాన్నే మళ్లీ ప్రయాణం ప్రారంభించారు. పాణ్యం సమీపంలోని శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్ (ఎస్సార్బీసీ) వద్ద ఆటోని ఆపి స్నానానికి వెళ్లారు. జార్జి ప్రధాన కాల్వలో దిగి ఈత కొడుతుండగా... బ్లాక్–3 కాల్వలోకి అక్కచెల్లెల్లు దిగారు. కొద్దిసేపు తర్వాత గంగోత్రి, వెన్నెల అక్కడి నుంచి పక్కనున్న ప్రధాన కాల్వలోకి వెళ్లారు. అందులో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఉధృతికి ఇద్దరు కొట్టుకుపోయారు. గంగోత్రి కాల్వ పక్కనే చెట్టు కొమ్మలు పట్టుకొని బయటకొచ్చి కేకలు వేసింది. అప్పటికే ఒడ్డుకు చేరిన జార్జితో పాటు స్థానికులు అక్కడికి చేరుకుని కాల్వలో దూకి గాలించగా కనిపించలేదు. తర్వాత గల్లంతు విషయం పోలీసులకు తెలియజేయడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. చెల్లి బయటకు రావే అంటూ మిగతా ఇద్దరు సోదరీమణులు ఘటనా స్థలంలో విలపించిన తీరు స్థానికులకు కంటతడిపెట్టించింది.

కాపాడేందుకు వెళ్లి..

- తెలుగుగంగ కాల్వలో యువకుడి గల్లంతు



గల్లంతైన గౌతం(ఫైల్)

మహానంది: ప్రమాదవశాత్తు తెలుగుగంగ కాలువలో పడిన ఓ యువకుడిని కాపాడేందుకు వెళ్లి మరో యువకుడు గల్లంతయ్యాడు. శనివారం రాత్రి ఎంసీఫారం సమీపంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వైఎస్సార్ జిల్లా బద్వేలుకు చెందిన బావబావమరుదులైన మహేష్, సురసుర గౌతంలు కలిసి మహానందిలో జరిగే ఓ వివాహానికి వస్తున్నారు. మార్గమధ్యంలో ఎంసీ ఫారం సమీపంలోని తెలుగు గంగ కాల్వ గట్టుపై సెల్ఫీ తీసుకుంటుండగా మహేష్ కాల్వలో పడ్డాడు. అతడిని కాపాడేందుకు గౌతం (17) కాలువలోకి దూకాడు. అయితే మహేష్ చెట్ల కొమ్మల సాయంతో గట్టుపైకి చేరాడని, గౌతం నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. గౌతం తల్లి మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గల్లంతైన యువకుడి కోసం పోలీసు, ఫైర్ సిబ్బంది గాలించినా ప్రయోజనం లేకపోవడంతో కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగారు.

నేడు జాతీయ అప్రెంటిషిప్ మేళా

నంద్యాల(న్యూటౌన్): డోన్ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాదరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ కంపెనీలు ఇందులో పాల్గొంటాయన్నారు. జిల్లాలో ఐటీఐ పాస్ అయిన అభ్యర్థులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హాజరయ్యే అభ్యర్థులు పదో తరగతి, ఐటీఐ పాస్ సర్టిఫికెట్, కులధ్రువీకరణ, అభ్యర్థి బ్యాంక్ పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఫొటోలతో హాజరు కావాలన్నారు.

వివాహిత ఆత్మహత్య

బనగానపల్లె రూరల్: మండలంలోని మీరాపురం గ్రామానికి చెందిన బి.రంగమ్మ (26) కడుపు నొప్పి తాళలేక శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన మాదన్న భార్య రంగమ్మ కొద్ది నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతుండేది. పలువురు వైద్యుల వద్ద చూపించినా నయం కాకపోవడంతో శనివారం ఉదయం పేడ రంగును నీటిలో కలుపుకుని తాగింది. కుటుంబ సభ్యులు బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు సంతానం ఉన్నారు.



వీపునకు కొక్కీలు గుచ్చుకొని బండి చక్రాన్ని పైకి లాగుతున్న యువకులు



నిప్పంటించిన ఇనుప కడ్డీలను శరీరంతో వంచుతున్న యువకుడు

గుడేకల్ గుండెజల్లు!

మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో దసరా పండుగను పురస్కరించుకొని చింతమాన్ గల్లీ, రామమ్‌గల్లీ, గచ్చిన్‌గల్లీలకు చెందిన యువకులు శని, ఆదివారం తాము ఆరు నెలలుగా నేర్చుకున్న విన్యాసాలు ప్రదర్శించారు. సినిమాలను తలపించే రియల్ విన్యాసాలు చూసిన ప్రతి ఒక్కరికి ఒళ్లు గగుర్పొడవక మానదు. ఈ మూడు వ్యాయామశాలల యువకులు వీపునకు కొక్కీలు గుచ్చుకొని బండి చక్రాన్ని పైకి లాగడం, గ్యాస్ సిలిండర్లను పైకి లాగడం, ఆటోలు, బైక్‌లతో విన్యాసాలు, కర్రసాము, కుస్తీలు, పల్టీలు కొట్టడంతో పాటు రకరకాల విన్యాసాలు ప్రదర్శించారు. ఏటా దసరా పండుగా రోజు పెద్దలు, యువకులు, పిల్లలు విన్యాసాలు చేయటం ఆనవాయితీగా వస్తోంది. ఇలాంటి ప్రమాదకర విన్యాసాలు చేయవద్దని యువకులను వారించినా పెద్దల మాట పెడచెవిన పెడుతూ యథావిధిగా కొనసాగిస్తున్నారు.

– ఎమ్మిగనూరురూరల్







ఆటో ముందు చక్రాన్ని గాల్లోకి లేపి విన్యాసం, బైక్‌కు గిరక వేసి ముందు డ్రమ్ము కట్టుకొని వీపునకు ఆటోను కట్టుకొని లాగుతున్న యువకుడు

కర్రసాము చేస్తున్న యువకులు